నమస్తే తెలంగాణ
నిజామాబాద్, మంగళవారం 27 మే 2025
TUESDAY, MAY 27, 2025

# చిన్నపాటి వర్షానికే చిత్తడి

- రోడ్లపై పారుతున్న మురుగు నీరు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



పాత కోర్టు భవనం వెనక కాలనీలో ఇండ్లలోకి చేరిన నీరు



బిచ్కుందలో బస్టాండ్ వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు

బిచ్కుంద, మే 26 : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. మండల కేంద్రంలో రహదారి విస్తరణ పనుల కోసం రోడ్డును తవ్వి ఉంచడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లపై మోకాళ్ల లోతు భారీ గుంతలు ఏర్పడి రోడ్డు అధ్వానంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మొత్తం గుంతలమయమైంది. నీరు నిలిచి ఉండడంతో గుంతలు ఏర్పడక ద్విచక్రవాహన దారులు వాటిలో పడి గాయాలపాలవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి.

దీంతో మురుగు నీరు రోడ్డుపై పారడంతో వాహనదారలు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని పాత కోర్టు భవనం వెనకాల కాలనీలో చిన్న పాటి వర్షానికే ఇండ్లల్లోకి నీరు చేరుతున్నది. కాలనీలో మురికి కాలువలు కూడా అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు తమ ఇండ్లల్లోకి వచ్చి చేరుతున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కాలనీలోని మురికి కాలువలు శుభ్రం చేయించడంతోపాటు రోడ్డుపై గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

## డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని వినతి



భిక్కనూరు తహసీల్ కార్యాలయంలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భిక్కనూరు, మే 26 : మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించాలని ఆర్డీవో వీణకు బీఆర్ఎస్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భిక్కనూరు మాజీ సర్పంచ్ తునికి వేణు మాట్లాడుతూ.. భిక్కనూరులో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో 7.10.2023లో డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరై లబ్ధిదారులకు ఆర్డర్ కాపీలు అందజేశారు. డబుల్ బెడ్ రూం ఇండ్లల్లో మరమ్మతుల కోసం నిధులు కేటాయించి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. లేనిపక్షంలో బాధితుల తరపున కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోన్ల రాంచంద్రం, ప్రభాకర్, వడ్ల శ్రీనివాస్, చంద్రం, రవి, బసవయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

కామారెడ్డి, మే 26 : జిల్లా కేంద్రంలోని ఆదిత్య దవాఖాన వారి సహకారంతో కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, లయన్స్ క్లబ్ వివేకానంద సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో 73 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వివేకానంద అధ్యక్షుడు మారుతి, రక్తదాతల అధ్యక్షుడు జమీల్, ఐవీఎఫ్ సేవాదళ్ చైర్మన్ బాలు, ఆర్కే కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి, డాక్టర్ పుట్ట అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, చంద్రశేఖర్, గంప ప్రసాద్, ఉప్పల హరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

మాచారెడ్డి, మే 26 : మండలంలోని గజ్యానాయక్‌తండా పంచాయతీ కార్యదర్శిపై గ్రామానికి చెందిన అజీజ్ అనే వ్యక్తి జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో ప్రభుత్వ స్థలాలు కబ్జా చేయడంతోపాటు ప్రభుత్వ స్థలాలు ప్లాట్లుగా మార్చడానికి తప్పుడు ఓనర్‌షిప్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ తప్పుడు ధ్రువీకరణ పత్రాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అజీజ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

## పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కామారెడ్డి, మే 26 : పట్టణంలోని ఆదర్శ విద్యాలయం పాఠశాలలో 2003-2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 22 ఏండ్ల తర్వాత కలుసుకున్నారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక




రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కామారెడ్డి, మే 26 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ (అండర్-8, 10, 12) విభాగాల్లో సెలక్షన్స్‌కు జిల్లా నలుమూలాల నుంచి దాదాపు 110 మందికిపై క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు జూన్ 1వ తేదీన హైదరాబాద్‌లోని జిమ్‌ఖానా గ్రౌండ్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కార్యదర్శి అనిల్‌కుమార్, ఆర్‌కే కళాశాల డీన్ నవీన్ కుమార్, ప్రతినిధులు నరేశ్‌రెడ్డి, శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, శివా గౌడ్, నరేశ్, మహేశ్, నవీన్, సురేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తునికాకు తరలిస్తున్న వాహనం స్వాధీనం

లింగంపేట, మే 26 : లింగంపేట మండలం కన్నాపూర్ గ్రామం నుంచి అక్రమంగా తునికాకు తరలిస్తున్న వాహనాన్ని సోమవారం పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు బీట్ అధికారి సంరీన్ తెలిపారు. కన్నాపూర్ గ్రామం నుంచి సేకరించిన తునికాకును వాహనంలో తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు పోల్కంపేట గ్రామ శివారులో పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. వాహనంలో అక్రమంగా తరలిస్తున్న తునీకాకు విలువ సుమారు 60 వేల రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. వాహన డ్రైవర్‌ను సైతం పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

**అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పరు, జేసీబీ సీజ్**

నస్రుల్లాబాద్, 26 : అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పరు, జేసీబీ సీజ్ చేసినట్లు బీర్కూర్ ఎస్సై రాజుశేఖర్ తెలిపారు. బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో తెలంగాణ తిరుమల దేవస్థానం గుట్ట కింద మొరం తవ్వుతున్నట్లు ఆదివారం ఎస్సైకి గ్రామస్తులు ఫిర్యాదు చేయగా సోమవారం క్షేత్రస్థాయిలో వెళ్లి తనిఖీలు చేపట్టగా మొరం తవ్వుతున్న జేసీబీని, టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. జేసీబీ యజమాని రబ్బానిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## గ్రామాల్లో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్



కన్నాపూర్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో

లింగంపేట/బాన్సువాడ రూరల్, మే 26 : లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయా క్లస్టర్లలో విధులు నిర్వహిస్తున్న ఏఈవోలు గ్రామాల్లో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మోతె, పోల్కంపేట, ముంబాజీపేట, పర్మళ్ల, లింగంపేట క్లస్టర్ల పరిధిలోని గ్రామాల్లో రైతుల నుంచి వివరాలు సేకరించినట్లు చెప్పారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం నాటికి 2,600 మంది వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల రైతులు తమ పేర్లను ఏఈవోల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. బాన్సువాడ మండలం లోని బోర్లం గ్రామంలో ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ల కోసం ఏఈవో రాణి రైతుల నుంచి వివరాలు సేకరించారు. బోర్లం క్లస్టర్ పరిధిలోని తాడ్కోల్, బుడ్మి, తిర్మలాపూర్, కొత్తాబాది, బోర్లం క్యాంపు, జక్కల్‌దాని తండా, కొయ్యగుట్ట గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 50 ట్రాక్టర్ల ఇసుకకు అనుమతులు

నాగిరెడ్డిపేట, మే 26 : నాగిరెడ్డిపేట మండలం గోలిలింగాల శివారులోని మంజీరా నది నుంచి 50 ట్రాక్టర్ల ఇసుక తరలింపునకు సోమవారం అనుమతులు ఇచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఎల్లారెడ్డిలోని వైకుంఠధామంలో పనుల నిమిత్తం శ్రీబాల్ సింగ్ విభ కన్‌స్ట్రక్షన్‌కు 50 టిప్పుల ఇసుకను 26, 27 తేదీల్లో తీసుకువెళ్లేందుకు అనుమతులు ఇచ్చినట్లు ఆయన చెప్పారు.

# రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

ఎల్లారెడ్డి రూరల్, మే 26 : ఎల్లారెడ్డి మండలంలోని గండిమాసానిపేట్, మత్తమాల సహకార సంఘాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి నదీమొద్దీన్ తెలిపారు. జీలుగ బస్తాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను సంబంధిత ఏఈవోల వద్ద అందించి పర్మిట్లు పొందాలని సూచించారు. 30 కిలోల జీలుగ బస్తా 2,137.50 రూపాయలకు అందిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తీసుకువెళ్లాలని సూచించారు.



నల్లమడుగులో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న సహకార సంఘం చైర్మన్ రమేశ్



మాల్తుమ్మెదలో జీలుగ బస్తాలను అందజేస్తున్న విండో అధ్యక్షుడు నర్సింహులు, అధికారులు

**నాగిరెడ్డిపేట మండలంలో..**

నాగిరెడ్డిపేట, మే 26 : మండల కేంద్రంలోని మాల్తుమ్మెద సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు రాయితీపై వచ్చిన జీలుగ(పచ్చరొట్ట) విత్తనాలను విండో అధ్యక్షుడు నర్సింహులు, ఏవో సాయి కిరణ్ రైతులకు సోమవారం పంపిణీ చేశారు. కార్యాలయానికి 30 క్వింటాళ్ల జీలుగ వచ్చినట్లు చెప్పారు. వాటిని రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విండో కార్యదర్శి సందీప్‌కుమార్, డైరెక్టర్ వంశీ గౌడ్, సిబ్బంది దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

**లింగంపేట మండలంలో..**

లింగంపేట, మే 26 : లింగంపేట మండలంలోని నల్లమడుగు, శెట్పల్లిసంగారెడ్డి, లింగంపేట సహకార సంఘాల్లో సోమవారం రాయితీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. నల్లమడుగు సహకార సంఘంలో చైర్మన్ రమేశ్ రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహకార సంఘాల సీఈవోలు శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, పెంటయ్య, ఆయా గ్రామాలకు చెందిన వ్యవసాయ విస్తరణాధికారులు, సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## గెస్ట్‌హౌస్‌కు స్థలం కేటాయించాలని వినతి



నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, మే 26 : ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌తోపాటు ప్రెస్‌క్లబ్ భవనాల నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో స్థానిక నాయకులు డీటీ మాసనకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎల్లారెడ్డిలో గెస్ట్‌హౌస్ లేని కారణంగా నాయకులు, ఉన్నతాధికారులు వచ్చిన సమయంలో అనువైన ప్రదేశం లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తున్నదన్నారు. అధికారులు స్పందించి స్థలం కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మర్లు సాయిబాబా, లింగమయ్య, శివానంద తదితరులు పాల్గొన్నారు.

**పంచాయతీ స్థలం కాపాడాలని..**

ఎల్లారెడ్డి రూరల్, మే 26 : ఎల్లారెడ్డి మండలం కళ్యాణి గ్రామంలోని పంచాయతీ స్థలాన్ని కాపాడాలని స్థానికులు పంచాయతీ కార్యదర్శికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన వ్యక్తి పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ స్థలంలో ఇంటి నిర్మాణానికి మార్కింగ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఈ స్థలంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించి పంచాయతీ స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా శ్రీనివాస్



నాగిరెడ్డిపేట, మే 26 : మండల పూర్తి స్థాయి తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డి డీఏవోగా పని చేస్తున్న శ్రీనివాస్‌రావును 10 నెలల క్రితం నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. కాగా సోమవారం నాగిరెడ్డిపేట పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ.. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పూర్తి స్థాయి తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

## అథ్లెటిక్స్ పోటీలకు రామారెడ్డి విద్యార్థులు

రామారెడ్డి, మే 26: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండల కేంద్రానికి చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు శిక్షకుడు దండబోయిన బాల్‌రాజు సోమవారం తెలిపారు. 600 మీటర్ల పరుగు పందెంలో స్నేహిత, 300 మీటర్ల పరుగు పందెంలో ఎన్. పోచవ్వ, ఎన్. సాత్విక, 60 మీటర్ల రన్‌లో బండ్ల సిద్దు, సాత్విక, లాంగ్ జంప్‌లో శరణ్య ఎంపికైనట్లు వివరించారు. వీరు జూన్ ఒకటో తేదీన హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## వాహనాల తనిఖీ

బీబీపేట్, మే 26 : మండలంలోని శ్రీగాధ రోడ్డు వద్ద ఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలను లేని 40 మంది వాహనదారులకు జరిమానా విధించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, పోలీస్ సిబ్బంది రంజిత్‌గౌడ్, అనిల్ కుమార్, శ్రీరాం, ఫాయాజ్ పాల్గొన్నారు.

## తనిఖీలు పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎస్ఆర్పీ మౌనిక

నస్రుల్లాబాద్, మే 26 : ఎలాంటి రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా తనిఖీలను పారదర్శకంగా, పకడ్బందీ చేపట్టాలని ఎస్ఆర్పీ మౌనిక అన్నారు. మండలంలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో రూ.2 కోట్ల 86 లక్షలతో చేపట్టిన ఉపాధి హామీ పనులపై మంగళవారం నుంచి తనిఖీలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. నస్రుల్లాబాద్‌లోని గిరిజన గురుకుల పాఠశాలలో సమన్వయ కమిటీ సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఉపాధి హామీలో చేసిన 30 రకాల పనులపై క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యకాంత్, ఏపీవో సౌజన్య, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## వరద కాలువకు మరమ్మతులు చేపట్టాలి

రామారెడ్డి, (సదాశివనగర్)మే 26: సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు వరద కాలువ తెగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావును కలిసి గోడును వెళ్లబోసుకొన్నారు. వెంటనే ఆయన కట్ట తెగిపోయిన ప్రాంతాన్ని సందర్శించి, ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఇరిగేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ మల్లేశ్ మంగళవారం అధికారులను పంపించి, మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించొద్దు



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

బాన్సువాడ, మే 26 : ప్రభుత్వ అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించొద్దని ఏఐఎస్‌బీ, బీసీ వీఎస్, టీఎన్ఎస్ఎఫ్, జీవీఎస్, ఏఐపీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు సూచించారు. బాన్సువాడలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాన్సువాడ పట్టణంలోని శ్రీచైతన్య, అర్బర్ హైట్స్, మదీనా పబ్లిక్ స్కూల్‌కు ప్రభుత్వ నుంచి ఎలాంటి అనుమతులూ లేవని, అడ్మిషన్లు ప్రారంభిస్తూ.. ప్రచారాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. కరపత్రాలు, హోర్డింగ్స్, ఫ్లెక్సీలతో విద్యార్థుల తల్లిదండ్రులను మభ్య పెట్టి మోసం చేస్తున్నారని అన్నారు. ఈ విషయంలో మండల విద్యాధికారిని వివరణ కోరామని, ఎలాంటి అనుమతులూ పొందలేదని చెప్పినట్లు విద్యార్థిసంఘాల నాయకులు తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, బీసీ వీఎస్ ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దత్తు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు పుట్ట భాస్కర్, జీవీఎస్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, ఏఐపీఎస్‌యూ జిల్లా నాయకులు గోపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నీటితొట్టి నిండా నాచు..

బాన్సువాడ, మే 26 : జుక్కల్‌లోని పశుసంవర్ధక శాఖ ఎదుట ఏర్పాటు చేసిన నీటితొట్టె నాచుతో నిండి నీరు కలుషితమైనా పట్టించుకునే వారు కరువయ్యారు. నోరు లేని మూగజీవాలకోసం నిర్మించిన నీటితొట్టె నాచుతో నిండిపోయింది. నీరు పచ్చగా మారినా తొట్టెను శుభ్రం చేయించేవారు కరువయ్యారు. వెంటనే నీటితొట్టెని శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



నీటి తొట్టి లో నాచుతో పచ్చగా మారిన నీరు

## మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవీణ్ కుమార్

నస్రుల్లాబాద్, మే 26 : మండల కేంద్రంలోని సమీకృత మండల భవన సముదాయంలో రేషన్ డీలర్లతో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మైక్‌లు, దండోరా, ఫ్లెక్సీల ద్వారా జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యం ఒకే సారి పంపిణీ చేయనున్నట్లు ప్రజలకు తెలియజేయాలని ఆయన సూచించారు. జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

**బీర్కూర్‌లో మండల సమాఖ్య సమావేశం..**

నస్రుల్లాబాద్, మే 26 : బీర్కూర్‌లోని స్త్రీ శక్తి భవనంలో మండల సమాఖ్య సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. స్కూల్ యూనిఫాం, ఇందర మ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాస్, ధాన్యం కొనుగోలు, బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణం ఇప్పించాలని ఏపీడీ డీఆర్డీవో మురళి సూచించారు. సమావేశంలో ఎంఎస్ అధ్యక్షురాలు నాగమణి, ఏపీఎం గంగాధర్, సీసీఎస్‌లు నాగలక్ష్మి, పండరీ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కూలింగ్ వాటర్ ఫ్రిజ్ వితరణ



తాడ్వాయి గ్రంథాలయానికి అందజేసిన కూలింగ్ వాటర్ ఫ్రిజ్

లింగంపేట(తాడ్వాయి), మే 26 : తాడ్వాయిలోని గ్రంథాలయానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి కూలింగ్ వాటర్ ఫ్రిజ్ అందించినట్లు గ్రంథపాలకుడు పుల్లూరి రాజలింగం తెలిపారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకుల కోసం చల్లని తాగు నీటిని అందించడానికి దాతల సహకారంతో కూలింగ్ వాటర్ ఫ్రిజ్ అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మర్రి నర్సింహులు, బాపురావు, కల్పన, పాఠకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

లింగంపేట, మే 26 : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సూచించారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యాబోధన చేయనున్నట్లు వివరించారు. విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, దుస్తులు, నోటుబుక్కులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నదని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.